క్లుప్తంగా

అభివృద్ధిలో దూసుకెళ్తున్న నెల్లికుదురు



నెల్లికుదురు: రాష్ట్రంలో నెల్లికుదురు మండలం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ అన్నారు. మండల శివారులోని పార్వతమ్మగూడెం గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఆర్ గార్డెన్‌ను శుక్రవారం యజమాని ఎం.రాం రెడ్డి, శశిధర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల పరిధిలో గార్డెన్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. గార్డెన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎర్రబెల్లి నవీన్‌రావు, సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, లక్ష్మీచంద్రశేఖరరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

మహబూబాబాద్: క్రీడా రంగంలోనూ జిల్లాను అగ్రస్థానంలో నిలించేందుకు క్రీడాకారులు పాటుపడాలని క్రీడాకారులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి వైస్ చైర్మన్ ఫరీద్, టోర్నమెంట్ కన్వీనర్ జాకీర్‌హుస్సేన్, నాయకులు జనార్దన్, వెంకన్న, మురళీధర్‌రెడ్డి, రాజశేఖర్, రఫీ, శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి గ్రామంలో ట్రైనీ కలెక్టర్ పింకేష్ కుమార్ పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. శుక్రవారం గుండంరాజుపల్లిలో పర్యటించి పల్లెప్రకృతి వనం, నర్సరీ, ప్రాథమికోన్నత పాఠశాల, డబుల్ బెడ్రూంతోపాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యాంసుందర్, ఎంపీఓ యాకయ్య, ఫాయక్ అలీ పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయంలో శనివారం రాత్రి 8:35 గంటలకు గోవిందమాంబదేవి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని ఆలయ ట్రస్ట్ చైర్మన్ పమ్మి సనాతనాచారి శుక్రవారం తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని వారు పేర్కొన్నారు.

వైభవంగా చండీ హోమం



గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం రెండోరోజు ఉదయం 9గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నమక చమక సహిత రుద్ర హోమం, చండీహోమం, నవగ్రహ హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 12మంది దంపతులు యజ్ఞతంతులో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం 1గంటకు ఆలయ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బీరం శ్రీపాల్‌రెడ్డి, శివ, సాగర్, కందికొండ శ్రీనివాస్, ఎలమందల శ్రీనివాస్, బొల్లికొండ శ్రీనివాస్ ఏర్పాట్లు చేశారు.

వేడుకల్లో నాయకుల మధ్య వాగ్వాదం

గార్ల: సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల కేక్ కట్ చేసే విషయంలో గార్ల మండల బీఆర్ఎస్ పార్టీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. శుక్రవారం గార్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ రాకముందే, పార్టీ మండల కార్యదర్శి పానుగంటి రాధాకృష్ణ ఎంపీపీ ఎం.శివాజీచౌహాన్‌చే కేక్‌ను కట్ చేశారు. దీంతో లక్ష్మణ్‌నాయక్, రాధాకృష్ణను పిలిచి నేను రాక ముందే కేక్ కట్ ఎలా కట్ చేయిస్తావు అంటూ ఇరువురి మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మొక్కలు నాటి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేలు బానోతు శంకర్‌నాయక్, డీఎస్ రెడ్యానాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



నెహ్రూసెంటర్: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్



కురవి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



మహబూబాబాద్: ఎమ్మెల్సీ రవీందర్‌రావుకు కేక్ తినిపిస్తున్న నాయకులు



నెల్లికుదురు: కేక్ కట్ చేస్తున్న నాయకులు



గూడూరు: విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసిన నాయకులు



మరిపెడ: కేక్ కట్ చేస్తున్న గ్రంథాలయ చైర్మన్ గుడిపుడి నవీన్



కురవి: బలపాల పీహెచ్‌సీలో మొక్క నాటిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి



గార్ల: వేడుకల్లో పాల్గొన్న నాయకులు



పెద్దవంగర: కేక్‌కట్ చేస్తున్న నాయకులు



కేసముద్రం: పీహెచ్‌సీలో..



మహబూబాబాద్ రూరల్: జంగిలిగొండలో..

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గార్ల: విద్యార్థులు కష్టపడి ఉన్నత ఫలితాలు సాధించాలని దక్షిణ మధ్య రైల్వే రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి భూక్యా కస్నానాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన విద్యార్థుల ఫేర్‌వెల్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు, ఎడ్ల అప్పయ్య, మాజీ ఎంపీపీ లాలునాయక్, ఎస్సై బానోత్ వెంకన్న, రాజ్‌కుమార్‌జాదవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామంలో మార్చి 1నుంచి 3వ తేదీ వరకు జరిగే బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలను విజయవంతం చేయాలని గొల్లచర్ల సర్పంచ్ చేరెడ్డి సమ్మిరెడ్డి కోరారు. శుక్రవారం గ్రామానికి చేరుకున్న ధ్వజస్తంభానికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నున్నా రమణ, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సత్తిరెడ్డి, సతీష్‌కుమార్, ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారానికి ఎంపిక

నర్సింహులపేట: కొరమండల్ ఇంటర్ నేషనల్ వారి గ్రామీణ బాలికల ప్రతిభ పురష్కారానికి నర్సింహులపేట హైస్కూల్‌కు చెందిన సలుగు రోహిణి ప్రథమ అవార్డు, చందు స్పందన ద్వితీయ అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం రోహిణికి రూ.5వేలు, స్పందనకు రూ.3,500 నగదును హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో అందజేశారు.

ప్రతిపక్ష నేతల విమర్శలు అర్థరహితం

తొర్రూరు: గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న మంత్రి దయాకర్‌రావుపై ప్రతిపక్ష నేతల విమర్శలు అర్థరహితమని జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. మంత్రి ఎర్రబెల్లిపై రేవంత్‌రెడ్డి, షర్మిల విమర్శలను నిరసిస్తూ శుక్రవారం డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. అబద్ధాలకు, అసత్యాలకు పుట్టిన అక్రమ సంతానమే రేవంత్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. బీజేపీ వదిలిన బాణం షర్మిల, చంద్రబాబు వదిలిన బాణం రేవంత్‌రెడ్డిలు. మచ్చలేని నేత దయన్నపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, గ్రామీణాభివృద్ధి కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకట నారాయణగౌడ్, నాయకులు కిషోర్‌రెడ్డి, రామిని శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, ఎన్నమనేని శ్రీనివాసరావు, కుర్ర శ్రీనివాస్, కల్పన పాల్గొన్నారు.



తొర్రూరు: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్

ప్రజల మన్ననలు పొందిన మంత్రి దయన్న

పెద్దవంగర: ప్రజల మన్ననలు చూరగొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై విమర్శలు సరికావని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య మాట్లాడారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజా ప్రస్థానం యాత్రలో భాగంగా వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంత్రి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వెంకన్న, సత్యనారాయణ, సుధాకర్, హరీశ్, లింగమూర్తి పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

● ముస్తాబైన ఆలయాలు

మరిపెడ రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామ శివారు అగస్త్రేశ్వర ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయం వద్ద మూడు రోజుల పాటు మహాశివరాత్రి జాతర కనుల పండువగా కొనసాగనుంది. 19న అభిషేకాలు, అర్చనలు, మొక్కులు సమర్పించనున్నారు. 20న అర్చనలు, మొక్కులు అనంతరం సాయంత్రం 6 గంటల సమయంలో స్వామివారు ప్రతిమలతో ఊరేగింపుగా అబ్బాయిపాలెం చేరుకోవడంతో జాతర ముగుస్తుంది.

కొత్తగూడ: మహాశివరాత్రి వేడుకలకు గుండం శివాలయం సిద్ధమైంది. కొత్తగూడ, నర్సంపేట, ఖానాపురం మండలాల నుంచి భక్తులు మహాశివరాత్రి రోజు అధిక సంఖ్యలో తరలివచ్చి గుండం రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుంటారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో శనివారం రాత్రి జరిగే కల్యాణ మహోత్సవానికి ఆలయాలు సర్వం సిద్ధమయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు.

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గల శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ముస్తాబైంది.



మహబూబాబాద్ రూరల్: ముస్తాబైన రాజరాజేశ్వర ఆలయం



మరిపెడ రూరల్: కొండపై ముస్తాబైన అగస్త్రేశ్వర ఆయలం



చిన్నగూడూరు: మండల కేంద్రంలో



కొత్తగూడ: గుండం శివాలయం..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం వైభవంగా శ్రీ శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంద వీరన్న అన్నారు.

గ్రామాల అభివృద్ధే బీజేపీ లక్ష్యం



మాట్లాడుతున్న మోహన్‌రావు

కొత్తగూడ: గ్రామాల అభివృద్ధే బీజేపీ లక్ష్యమని రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో జరిగిన ప్రజాగోస–బీజేపీ భరోసా సమావేశంలో ఆయన మాట్లాడారు. సొమ్ము ఒకడిది సోకు ఇంకొకడిది అనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ముందుగా గ్రామాల్లో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న అటవీ హక్కులు, భూములకు సాగు నీరు, గ్రామాలకు తాగునీరు అందించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచంద్రరావు, ములుగు జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్‌నాయక్, రాష్ట్ర పాలసీ ఇన్‌చార్జ్ రాజునాయక్, గిరిజన మోర్చా అధికార ప్రతినిధి తాటి కృష్ణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన ప్రభుత్వం

పెద్దవంగర: ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించి కాలయాపన చేస్తుందని ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గంట్లకుంట గ్రామంలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములుగౌడ్, మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్, వడ్డెకొత్తపల్లి ఎంపీటీసీ సాయిని ఝాన్సీ, నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి పల్లకీ బహూకరణ

మరిపెడ రూరల్: నేడు మహాశివరాత్రిని పురస్కరించుకొని అబ్బాయిపాలెం కొండపై గల అగస్త్రేశ్వర స్వామి వారి జాతరను పకడ్బందీగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆలయ కమిటీ నిర్వాహకులకు సూచించారు. మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన దాత డాక్టర్ మడిపెల్లి రమేష్, సతీమణి మడిపెల్లి కనకమహాలక్ష్మి జ్ఞాపకార్థంగా అగస్త్రేశ్వర స్వామివారికి రూ.60వేలు విలువ గల టేకు కలప పల్లకీని ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేతుల మీదుగా శుక్రవారం ఆలయానికి బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థంగా 365 జాతీయ రహదారి క్రాస్ రోడ్డు నుంచి కొండపైకి సుమారు 2 కిలో మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షలు తన సీడీపీఎఫ్ నిధుల నుంచి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నారంరెడ్డి వెంకట్‌రెడ్డి, మచ్చ వెంకటనర్సయ్య, సర్పంచ్ జినుక మణిఇద్దయ్య, ఉపసర్పంచ్ బోడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



పల్లకీ బహూకరిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్

కురవి: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్సోవాల సందర్భంగా భోగ్‌బండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆనాటి కాలంలో సేవాలాల్ మహరాజ్ గిరిజన జాతికి హితబోధ చేసి ఆధ్యాత్మికత వైపు మళ్లించాడని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని గుర్తించి నియోజకవర్గానికి రూ.4లక్షలు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్, ఆలయ చైర్మన్ బాదావత్ రామునాయక్, ఆత్మ చైర్మన్ తోట లాలయ్య, నాయకులు పిచ్చిరెడ్డి, భాస్కర్, వీరన్న పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇళ్లు నిర్మిస్తే చర్యలు

తొర్రూరు: అనుమతి లేకుండా ఇళ్లు నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ సింగారపు కుమార్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పలు కాలనీల్లో నూతన ఇంటి నిర్మాణాలను మున్సిపల్ సిబ్బంది పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ టీఎస్ బీపాస్‌లో ఆన్‌లైన్ అనుమతి పొందిన తర్వాతే ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. సెట్ బ్యాక్ లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టవద్దన్నారు. అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భూసాని రాము, సిబ్బంది కనకరాజు, వెంకట్రాం నర్సయ్య, శంకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్: దివ్యాంగులు ఉపాధి, పునరావాస పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమాధికారి నర్మద శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 23 యూనిట్లు కేటాయించినట్లు తెలపారు. ఈనెల 28నలోగా దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పెరటి తోటలతో ఆరోగ్యం

కొత్తగూడ: పెరటి తోటల పెంపకంతో ఆరోగ్యం దాగి ఉందని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మాలతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్త రాంబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఏఈఓ రాజులు పాల్గొన్నారు.

రూ.15వేల విరాళం

కేసముద్రం: మండలంలోని సబ్‌స్టేషన్‌తండా జీపీలో నిర్మిస్తున్న కనకదుర్గమ్మ ఆలయానికిగాను, గోపా మహబూబాబాద్ డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య శుక్రవారం రూ.15వేల విరాళాన్ని అందించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా కోఆర్డినేటర్ మాలోత్ సురేష్‌బాబు కోరారు. సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, శరత్, నాయకులు యుగేందర్, అనిత్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో యాచకుడు మృతి

కేసముద్రం: మండల కేంద్రంలో గత కొద్దిరోజులుగా భిక్షాటన చేస్తున్న ఓ గుర్తు తెలియని యాచకుడు అనారోగ్యానికి గురై శుక్రవారం మృతి చెందాడు. 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి రోడ్డు పక్కన మృతి చెంది ఉండటాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా మృతుడు గూడూరు మండలం మర్రిమిట్ట గ్రామ శివారు తండాకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

గూడూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంతో చిన్నపిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మాజీ సర్పంచ్ బోడ సుమిత్ర అన్నారు. మండలంలోని గాజులగట్టు సమీప సోమ్లాతండా అంగన్‌వాడీ కేంద్రానికి సుమిత్ర సొంత ఖర్చులతో వేయింగ్ మిషన్ అందించారు. కార్యక్రమంలో జీపీ వార్డు సభ్యుడు లాలు, అంగన్‌వాడీ టీచర్ రఫియాబేగం, ఉపాధ్యాయుడు శ్రీధర్, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

మరిపెడ: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బస్టాండ్ సమీపంలోని నాలుగు దుకాణాలలో గురువారం రాత్రి దొంగలు చోరీలకు పాల్పడ్డారు. రజబెల్లి చికెన్‌సెంటర్, వేదశ్రీ ఫుట్‌వేర్, మార్కండేయా ఎలక్ట్రికల్ షాప్, మణికంఠ మిల్క్ సెంటర్‌లో ఇంటి వెనుక తలుపులు పగులకొట్టి లోనికి చొరబడి చోరీలకు పాల్పడ్డారు. పక్కనే ఉన్న మెడికల్ షాప్‌లో కూడా చోరీకి పాల్పడేందుకు ప్రయత్నించారు. మార్కండేయా ఎలక్ట్రికల్ దుకాణంలో రూ.27వేలు, వేదశ్రీ ఫుట్‌వేర్ దుకాణంలో రూ.22వేలు దొంగలు అపహరించినట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శివరాం మరణం సంఘానికి తీరని లోటు



గార్ల: మండలంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు అమరబోయిన శివరాం అకాల మరణం యూటీఎఫ్ సంఘానికి తీరని లోటని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం గార్లలోని వర్తకసంఘం భవనంలో జరిగిన శివరాం సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె యాకూబ్, జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, ఎంఈఓ పూల్‌చంద్, నర్సింహరావు, గట్టు అనంతరాములు పాల్గొన్నారు.

ఈ–వ్యర్థాల నియంత్రణకు కృషి చేయాలి



తొర్రూరు: ఎలక్ట్రానిక్ వ్యర్థాల నియంత్రణకు కృషి చేయాలని సేవా తరుణి అధ్యక్షురాలు వజినెపల్లి దీప అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఈ–వ్యర్థాలను సేకరించారు. సేకరించిన వ్యర్థాలను హైదరాబాద్‌కు తరలించారు. దీప మాట్లాడుతూ.. ఈ–వ్యర్థాలు భూమిలో కలిసిపోయేవి కాకపోవడంతో విషపూరితంగా మారి గాలిలో, భూమిలో, నీటిలోనూ కలుస్తూ ప్రాణకోటిపై ప్రభావం చూపెడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వజినెపల్లి శైలజ, కోశాధికారి చీదర నీలిమ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెద్దవంగర: పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని తహసీల్దార్ రమేష్‌బాబు సూచించారు. మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం వార్షిక పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఎన్ఓ అల్లందాసు భిక్షపతి, హెచ్ఎంలు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న చలో హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రభాకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా పూనెం ప్రభాకర్ మాట్లాడుతూ.. పోడుభూములను సాగు చేసుకుంటూ ఏజెన్సీ ప్రాంత ప్రజలు హక్కుపత్రాల కోసం ఎదురుచూస్తూ నిర్వీరామంగా పోరాడుతున్నారన్నారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు కొత్తపల్లి రవి, అఖిల భారత ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇరుగు అనిల్, పైండ్ల యాకయ్య, కందాల రంగయ్య, పల్లెల పాపారావు పాల్గొన్నారు.

రైలునుంచి జారిపడి వ్యక్తి మృతి

కేసముద్రం: రైల్లో నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లికి చెందిన రవీందర్ అనే వ్యక్తి, శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లో ఫుట్‌డోర్ వద్ద కూర్చుని ప్రయాణిస్తుండగా, తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్‌లోని డౌన్‌లైన్‌లో ఫుట్‌పాత్ తగలడంతో కిందపడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిసింది. కాగా క్రిష్ణా జిల్లాకు చెందిన మరో వ్యక్తి కాలికి గాయాలైనట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని జీఆర్పీ పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో వంట మనిషి..

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం గ్రామానికి చెందిన వంట మాస్టర్ సోమ వెంకయ్య (82) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. వెంకయ్య మృతి తీరని లోటని గ్రామస్తులు ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.